ప్రజాశక్తి

సోమవారం 28 ఆగస్టు 2023 · 8 పేజీలు · ఎన్‌టిఆర్ · కృష్ణా

ఉదాసీనత

- ఎన్టీఆర్ జిల్లాలో 1,537 ప్రైవేటు పాఠశాలల బస్సులు
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాల్సినవి 180

ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి

ప్రైవేటు పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికేట్లను రవాణా శాఖ నుంచి పొందడంలో యాజమాన్యాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు మాసాలు కావస్తున్నా ఇప్పటికీ వందల సంఖ్యలో బస్సులు ఫిట్‌నెస్ సర్టిపికేట్లు తీసుకోలేదు. పాఠశాలల వాహనాలు నడపాలంటే ఈ సర్టిఫికేట్ తప్పనిసరి. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో వాహనాలను పూర్తి స్థాయిలో చెక్ చేసి ఇవి నడిపేందుకు అనుకూలంగా ఉన్నాయని ధృవీకరించిన అనంతరం ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు జారీ చేస్తారు. ఎన్టీఆర్ జిల్లాలో 1537 ప్రైవేటు పాఠశాలల బస్సులు ఉంటే వీటిల్లో 1357 వాహనాలు మాత్రమే ఇంత వరకు రవాణా శాఖ నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికేట్లను పొందాయి. అంటే దాదాపు 180 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికేట్లను పొందాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. విజయవాడ నగరంలోనే ఇలాంటి వాహనాల సంఖ్య అధికంగా ఉంది. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ విజయవాడ పరిధిలో 1255 ప్రైవేటు స్కూళ్ల వాహనాలు ఉండగా 1106 వాహనాలు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు పొందాయి. 149 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికేట్లను పొందాల్సి ఉంది. అలాగే నందిగామా ఆర్టీఓ పరిధిలో 232 వాహనాలు ఉంటే 213 ధృవపత్రాలను పొందగా, 19 వాహనాలు పొందాల్సి ఉంది. జగ్గయ్యపేట యూనిట్ ఆఫీసు పరిధిలో ఉన్న 50 బస్సుల్లో 32 ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు పొందగా మరో 12 పొందాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

యాజమాన్యాలు పాటించాల్సిన అంశాలు

మోటారు వాహన చట్టం ప్రకారం వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, పన్ను చెల్లింపు రసీదు, పొల్యూషన్ అండ్ కంట్రోల్ సర్టిఫికెట్‌తో పాటు డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. డ్రైవర్ ఫొటోను తప్పనిసరిగా బస్సులో ఏర్పాటు చేయాలి. అద్దాలకు గ్రిడ్ అమర్చాలి. చిన్నారులు ఎక్కేందుకు కింద వరకు మెట్లు ఏర్పాటు చేయాలి. డ్రైవర్‌కు వాహనాలను నడపడంలో ఐదేండ్ల అనుభవం ఉండాలి. 60 ఏండ్లకు మించకుండా చూసుకోవాలి. డ్రైవర్‌లకు తప్పక కంటి పరీక్షలు జరిపించాలి. బస్సు డ్రైవర్‌కు స్కూల్ యాజామాన్యం (మిగతా 6లో)

సమరభేరి కార్యక్రమంలో భాగంగా పాదయాత్రలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, బోయి సత్యబాబు తదితరులు

ధరలు తగ్గించండి

'సమరభేరి'లో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

ప్రజాశక్తి-వన్‌టౌన్

ప్రజలను పీడిస్తున్న అధిక ధరలు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4వ తేదీ వరకు జరిగే సమరభేరి కార్యక్రమంలో భాగంగా ఆదివారం 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు మహంతిపురం నుంచి ప్రచార పాదయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలోనూ, ధరలను అదుపు చేయడంలోనూ ఘోరంగా విఫలమైందన్నారు. అదికారం చేపట్టిన నాటి నుండి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలిస్తూ పేద ప్రజలపై పనుల భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. రోజురోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు అడ్డు అదుపు లేకుండా ఆకాశాన్నంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అధికారం చేపట్టినప్పుడు వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.450 ఉండగా నేడు రూ.1200కు చేరిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటడంతో రవాణా ఛార్జీలు పెరిగి ప్రజలపై భారాలు పడ్డాయన్నారు. ప్రజా పంపిణీ ద్వారా కందిపప్పు, నూనె, ఇతర సరుకులు సరఫరా చేయాలని, డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, చెత్త పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల (మిగతా 6లో)

కేంద్ర హోం మంత్రికి స్వాగతం

అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న రాష్ట్ర హోం మంత్రి వనిత

ప్రజాశక్తి-గన్నవరం: కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, గుంటూరు ఐజి జి.పాలరాజు, కృష్ణాజిల్లా ఎస్పీ పి.జాషువా, విమానాశ్రయ ఇన్‌ఛార్జి డైరెక్టర్ పి.వి.రామారావు కేంద్ర హోం మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం బిఎస్ఎఫ్ హెలికాప్టర్లో అమిత్‌షా ఖమ్మం బయల్దేరి వెళ్లారు.

స్వయం సహాయ సంఘాల అభివృద్ధికి కృషి

- సున్నా వడ్డీకే రుణాలు అందజేత
- నాలుగు విడతల్లో రూ.125 కోట్లు పంపిణీ
- పొదుపు సంఘాల్లో అవినీతిపై ఆడిట్
- డిఆర్‌డిఎ పీడీ శివరామకృష్ణ

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

స్వయం సహాయక సంఘాల్లోని మహిళల సంక్షేమం, స్వావలంబన, సాధికారతకు కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వైఎస్సాఆర్ క్రాంతి పథం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.శివరామకృష్ణ తెలిపారు. సంఘాల్లోని పేద మహిళలు ఒక్కొక్కరికి సున్నా వడ్డీ రుణాలు అందించడంతో పాటు పలు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు. పొదుపు సంఘాల్లో చోటు చేసుకుంటున్న అక్రమాలు, అవినీతిని అరికట్టేందుకు ఆడిట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డ్వాక్రా గ్రూపులకు మంజూరవుతున్న లింకేజీ రుణాలు సంక్షేమ పథకాలు గురించి 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో శివరామకృష్ణ వివరించారు.

ప్రశ్న: జిల్లాలో పొదుపు సంఘాల్లో ఎందరు సభ్యులున్నారు? లింకేజీ రుణాలు ఎంత మంజూరయ్యాయి.?

జవాబు: జిల్లాలో 1177 గ్రామ సంఘాల్లోని 31,834 గ్రూపుల్లో 3,29,539 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. లింకేజీ రుణాలు నిరంతర ప్రక్రియ. రుణాలు చెల్లించిన గ్రూపులకు అర్హతలకు అనుగుణంగా తిరిగి బ్యాంకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుంది. జిల్లాలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో 23,178 గ్రూపులకు 1575 కోట్ల 37 లక్షలు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో (మిగతా 6లో)

బిజెపి విధానాలను ఐక్యంగా తిప్పికొడదాం

సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు హేమలత

సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న అఖిల భారత అధ్యక్షురాలు హేమలత

ప్రజాశక్తి-గుడివాడ

కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బిజెపి విధానాలను ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత పిలుపునిచ్చారు. తొమ్మిదో శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సు గుడివాడలోని రంజన నిరూల నగర్ (కమ్మవారి సత్రం)లో ఆదివారం జరిగింది. ముందుగా సిఐటియు జెండాను హేమలత ఎగురవేశారు. సదస్సులో హేమలత మాట్లాడుతూ బిజెపి అవలంభిస్తోన్న విధానాల వల్ల భారాలన్నీ ప్రజలపై పడుతున్నాయని, లాభాలు మాత్రం కార్పొరేట్ల జేబుల్లోకి వెళు తున్నాయని అన్నారు. కార్పొరేట్లకు రూ.14 లక్షల కోట్లకుపైగా రుణాలు కేంద్ర ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో వారి ఆస్తులు పెరిగాయన్నారు. శతకోటీశ్వరులకు ట్యాక్సులపై రాయితీలు ఇస్తున్న ప్రభుత్వానికి రుణాలు కట్టలేక ఆత్మహత్యలు చేసుకున్న రైతులు కనబడటంలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రవేశపెడుతుందని, దీనికి వ్యతిరేకంగా రైతులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కనీస అవసరాలు తీర్చకుండా ప్రజల సమస్యలను ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయన్నారు. ఇప్పటికే బిజెపిలో ఆర్ఎస్ఎస్ ప్రభావం పెరిగిందని, మతం పేరుతో దాడులకు పాల్పడుతుందని, ఐక్యతను విచ్ఛిన్నం చేసే దిశగా నడుస్తుందని తెలిపారు. కులం, మతాల పేరుతో దాడులకు తెగబడుతున్నారన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల కనీస వేతనాలు అమలు కావడం లేదని, కనీసం ఉద్యోగులుగా కూడా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రామిక మహిళల సమస్యల పరిష్కారానికి సిఐటియు వారికి అండగా ఉండి పోరాడుతుందన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి హెచ్.నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ లైంగిక వేధింపుల చట్టం ఉన్నా అమలు కావడం లేదన్నారు. అసంఘటిత రంగాల్లోనూ ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేసి అవి పనిచేసేలా చూడాలన్నారు. ఫ్యాక్టరీలలో లైంగిక వేధింపులు విపరీతంగా పెరుగుతున్నాయని, లైంగిక వేధింపులు చేసిన వారిని వదిలి వేధింపులపై ఫిర్యాదు చేసిన వారిని దోషులుగా చేస్తున్నారన్నారు. సదస్సుకు కామేశ్వరి, ధనశ్రీ, నిర్మలమ్మ, వరలక్ష్మి అధ్యక్షత వహించగా నివేదికను కె.ధనలక్ష్మి, సంతాప (మిగతా 6లో)

లక్ష్మీనారాయణ దంపతులకు సన్మానిస్తున్న దృశ్యం

ప్రధానోపాధ్యాయుడికి సాహితీ చక్రవర్తి అవార్డు

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లీలావతి పాఠశా లలో ప్రధానోపా ధ్యాయునిగా పని చేస్తున్న ఉడత లక్ష్మీ నారాయణ సాహితీ చక్రవర్తి అవార్డు అందు కున్నా రు. ఇటీవల విజయవాడలో జరిగిన 22వ మానస సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ జి.సమరం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు.

మదర్ థెరిస్సా సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - కంచికచర్ల : సమాజంలో పేదల పట్ల మదర్ థెరిస్సా సేవలు ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసు కోవాలని పలువురు కొనియాడారు. కంచిక చర్ల గ్రంథాలయంలో శని వారం గ్రంథాల యాధికారి రామ చంద్రుడు అధ్యక్షతన మదర్ థెరిస్సా 113వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. థెరిస్సా చిత్ర పటానికి జిల్లా పరిషత్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు షేక్ ఇస్మాయిల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠకులు పేరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సంగీతం తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక ఎంజి రోడ్‌లోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో సరస్వతీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో సంగీత తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. యం.దివ్య మాధురిచే ప్రారంభించబడిన ఈ సంగీత తరగతులలో తొలిరోజు సరళి స్వరాలు అనే అధ్యాయంతో ప్రారంభమయ్యాయి. సరళి స్వరాలు అంటే ఏమిటి? సంగీతంలో వాటి ప్రాముఖ్యత తదితర అంశాలను మాధురి వివరించారు. వీటితో పాటు పంచ స్థాయులు, సరళి స్వరాలు ఎలా రాయాలి, నోటేషన్, దాని అవశ్యకత తదితర అంశాలను కూడా వివరించారు. స్థాయులు మధ్య, తారా, మంద్ర, అనుమంద్ర, అతితార వంటి అంశాలతో పాటు స్థాయులు గురించి వివరించారు, సప్త స్వరాలు పలికే విధానం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వరాలను విద్యార్థుల చేత పలికించి, సాధన చేయించారు. తరగతిలో సాధన కాకుండా ఇంటి దగ్గర కూడా సాధన చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, వై.ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎకు స్వాగతం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకటకష్ణ ప్రసాద్ విదేశీ పర్యావరణ ముగించుకుని ఇటీవల స్వదేశానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం కేతనకొండ గ్రామానికి చెందిన సర్పంచ్ ఆశా నళిని, కో– ఆప్షన్ సభ్యులు పఠాన్ నాగుల్ మీరా, కొమ్మురు అచ్చరావు, పంచాయతీ కార్యదర్శి సరోజా బాయ్ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

నివాళి

ప్రజాశక్తి- నందిగామ : మండలంలోని కొడవటికల్లు గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు కొటారు శ్రీనివాసరావుకు మాతమూర్తి తులసమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం తులసమ్మ పార్థివదేహాన్ని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్థానిక తెదేపా నేతలతో కలిసి సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాటలు సిగ్గుచేటు

ప్రజాశక్తి - వీరులపాడు : వీరులపాడు మండల కేంద్ర తరలింపు విషయంపై సమాచారం లేదని ప్రతిపక్షాలు మాట్లాడటం సిగ్గుచేటని వీరులపాడు మండల వైస్ ఎంపిపి షేక్ నాగుల్ మీరా అన్నారు. శనివారం జుజ్జూరులో గల ప్రెస్‌క్లబ్‌లో వైసిపి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల తరలింపు కార్యక్రమం రాత్రికి రాత్రి జరిగిన విషయం కాదని, మండల మార్పు విషయం క్యాబినెట్లో నిర్ణయం జరిగి, చట్ట ప్రకారం బహిరంగంగా జరిగిన విషయమే గాని చీకటి వ్యవహారం కాదని అన్నారు. జుజ్జూరు సొసైటీ అధ్యక్షులు పూల రాంబాబు మాట్లాడుతూ విమర్శలు అనేవి వాస్తవానికి దగ్గరగా ఉండాలి తప్పిస్తే కేవలం రాజకీయాల కోసమే విమర్శలు చేయటం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. జుజ్జూరు గ్రామం మండల కేంద్రంగా మార్పు చెందిందని, గ్రామాభివద్ధికి మండల కేంద్రాభివద్ధికి సహకరించాల్సిన ప్రతిపక్షాలు అడుగడుగునా అడ్డు తగలటం, రాజకీయాలు చేయటం తగదని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు మండల కేంద్రం జుజ్జురుకు రావడం సంతోషదాయకమే ఐనా రాజకీయాల కోసమే విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. ఈ విషయం మండల ప్రజలు మొత్తం గమనిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ గెజిట్ 396తో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మాత్రమే మండల కేంద్ర తరలింపు జరిగిందని ఆయన తెలియజేశారు. మండల కేంద్ర తరలింపు విషయమై అన్ని పార్టీల నాయకులకు ఆహ్వాన కమిటీ సమాచారం ఇచ్చిందని ఈ విషయాన్ని పార్టీకి ఆపాదించడం ఏమాత్రం తగదని గ్రామ వైసిపి కన్వీనర్ పూల పుల్లారావు అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రమావత్ రాము, జడ్పీ హైస్కూల్ చైర్మన్ శాంతా, వార్డ్ నెంబర్లు కానూరు వెంకట్, గోపిశెట్టి నరసింహారావు, పరిటాల రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగుల్ మీరా

నాగాబంది కార్యక్రమం నిర్వహిస్తున్న జగ్గయ్యపేట పోలీసులు

జగ్గయ్యపేటలో నాగాబంది

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: విజయవాడ ఇన్ ఛార్జి సిటీ పోలీస్ కమిషనర్ జి.వి.జి.అశోక్ కుమార్ ఆదేశాల మేరకు డిసిపి వి.అజిత పర్యవేక్షణలో నందిగామ ఎసిపి జనార్ధన నాయుడు, జగ్గయ్యపేట సిఐ జానకిరామ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి 11 గంటల నుండి 01:00 వరకు "నాగాబంది" ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట ఎస్సై బీవీ రామా రావు సిబ్బందితో జగ్గయ్యపేట పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద వాహనములు తనిఖీ చేయగా, రికార్డులు లేకుండా తిరుగుచున్న 13 మోటారు సైకిల్స్, రెండు ఆటోలు సీజ్ చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. తాగి వాహనం నడుపుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని పట్టుబడ్డ వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళాశక్తికి తోడుగా 'మహాశక్తి'

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం కషి చేస్తుందని టిడిపి జాతీయ కోశాధికారి, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఆదివారం పట్టణంలోని 9వ వార్డులో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నారు. వార్డ్‌లలో నివసిస్తున్న మహిళల వద్దకు వెళ్లి తాతయ్య వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. తాతయ్య ఎదుట మహిళల కూలీలు తమ కష్టాలు చెబుతూ రోజువారి కూలీ పనులు చేసుకుంటూనే కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, రోజంతా పనిచేస్తే రూ.200 కూలి వస్తుందని దాంతోనే బతుకుబండి లాగుతున్నామని, నిత్యావసరాలు, గ్యాస్, కరెంటు విపరీతంగా పెరిగాయని, ఇంటిల్లపాది పనిచేసినా రెండుపూటల కడుపునిండా భోజనం చేసే పరిస్థితి లేదని, పూట గడవడం కష్టంగా ఉందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ మీవంటి వారి కష్టాలు చూశాకే చంద్రబాబు నాయుడు మహాశక్తి పథకాన్ని ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకష్ణ మరియు ఎస్ ఆర్ సి సి యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న శ్రీరాం తాతయ్య

నరసింహాచార్యులు ఆదర్శప్రాయుడు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మహా విద్యాదాత టేకి నరసింహాచార్యులు ఆదర్శప్రాయుడని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ కొనియాడారు. ఆదివారం వన్‌టౌన్‌లోని టేకి నరసింహాచార్యులు ఎడ్యుకేషన్ ట్రస్ట్ భవనంలో విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్వర్యంలో బ్రహ్మశ్రీ టేకి నరసింహాచార్యులు ఎడ్యుకేషన్ ట్రస్ట్‌వారు విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్ షిప్స్ ఫారంలు తోలేటి శ్రీకాంత్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ భవిషత్ తరాల విశ్వబ్రాహ్మణ విద్యార్థుల విద్యా అభివద్ధి కోసం, బంగారు భవిష్యత్ కోసం తను కష్టపడి సంపాదించిన ఆస్తులను ట్రస్ట్‌కు అందించిన మహనీయులు అన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్.టి.యు. యన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు కోసూరి రాజశేఖర్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ద్వారా ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేస్తాం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను భారత చైతన్య యువజన పార్టీ సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియపరిచేలా చేసి వారిలో చైతన్యం తీసుకురావడమే తమ లక్ష్యమని బి సి వై పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మచ్చ కోటేశ్వరరావు యాదవ్ తెలిపారు. ఆదివారం గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో భారత చైతన్య యువజన పార్టీ సోషల్ మీడియా విభాగం సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్రానికి చెందిన వారి జిల్లాల నుంచి సోషల్ మీడియా విభాగం ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మచ్చ కోటేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సోషల్ మీడియా విభాగం కమిటీలను నియమించనున్నట్లు తెలిపారు. తదనంతరం సోషల్ మీడియా విభాగం ప్రతినిధి శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలన నచ్చక చాలామంది ఆ పార్టీని వదిలి వెళ్తున్నారని, ఇందులో భాగంగా తాను కూడా వైసిపి నుంచి బయటికి వచ్చి శ్రీరామచంద్రయ్య పెట్టిన భారత చైతన్య యువజన పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సోషల్ మీడియా విభాగం ప్రతినిధులు మద్దెల ఏడుకొండలు రెడ్డి, అయ్యన్న,గుమ్మా రాజు, పసుపులేటి లలిత, మల్లికార్జున,వెంకటరమణ, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మచ్చ కోటేశ్వరరావు

గాయపడిన వ్యక్తికి సాయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ఇబ్రహీంపట్నం దగ్గరలో కిలేశపురం గ్రామం హైవే వద్ద రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలై రక్తపు మడుగులో ఉండగా మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి జగ్గయ్యపేట వైపు వస్తున్న టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజక వర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్ ప్రమాద ఘటన స్థలానికి వెళ్ళి తమ కారులో ఉన్న ఫస్ట్ ఎయిడ్ కిట్‌ని తీసుకుని వచ్చి స్థానికుల సహాయంతో దగ్గరుండి ఫస్ట్ ఎయిడ్ చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించాలని వారికి సూచించారు.

నకిలీ నర్సరీలపై చర్యలేవి?

ప్రజాశక్తి - గంపలగూడెం: మిర్చి రైతులు ఈ ఏడాది కూడా బోల్తాపడ్డట్టేనా.? అన్న సందిగ్ధం రైతుల్లో మొదలైంది. పేరు, ఊరులేని నర్సరీలో ఎడాపడా ఎగబడి మిర్చినారు లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేశారు. పండేదో.. ఎండేదో.. తెలియదు కానీ, ప్రాథమికంగా రైతులు, కవులు రైతులు ఇప్పటికే ఎకరానికి వేల రూపాయలు ఖర్చు చేశారు. వీటి ఫలితాలు రావాలంటే కేవలం నర్సరీ యజమానులు ఇచ్చే మిర్చినారుపై ఆధారపడి ఉంటుందని రైతులు రైతులే సాక్షాత్తు తెలుపుతున్నారు. మండలంలోని అక్రమ నర్సరీలు 40 పైగా ఉన్న, ఉద్యానవన మరియు వ్యవసాయ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం విశేషం. పలుమార్లు అదేమని అడిగిన పెదవి విపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మొదటినుండి అధికారులు నకిలీ నర్సరీ యజమానులతో కుమ్మక్కై రైతులకు నేరుగా నష్టం చేస్తున్నారనేది రైతుల వాదన. ఇదిలా ఉంటే ఆ సమయానికి రైతుల హడావిడిగా నానా కష్టాలు పడి, అప్పులు తెచ్చి నకిలీ నర్సరీల వద్ద మిర్చినారు భారీగా కొనుగోలు చేస్తున్నారు. పంట సమయంలో ఏమైనా లోపాలు వస్తే ఎక్కడికెళ్లి అడగాలో తెలియని దుస్థితిలో రైతన్నలు ఉన్నారని పలువురు రైతులే నేరుగా చెబుతున్నారు. వ్యవసాయ శాఖలో పనిచేస్తూ, వ్యవసాయదారులకు సహాయ సహకారాలు అందించాల్సిన సదరు అధికారులు వ్యవసాయానికే అన్యాయం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా మండల స్థాయి ఉద్యాన, వ్యవసాయ అధికారులు చేస్తున్న కుమ్మక్కుపై ఉన్నతాధికారులు ఆరా తీసి, చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గంపలగూడెం ఎన్.టి.ఆర్ కాలనీ సమీపాన పేరు ఊరు లేని నాలుగు ఎకరాల నర్సరీలో నాలుగు రోజుల్లోనే నారును విక్రయించడం విశేషం.

ఎలాంటి పేరు లేకుండా నడుపుతున్న నర్సరీ

నేడు సత్యాగ్రహం దీక్ష

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు "సత్యాగ్రహం" దీక్ష పేరుతో నేడు ఉదయం 9 గంటలకు మండలంలోని అనుమంచిపల్లి గ్రామంలో గల అక్రమ ఇసుక గుట్టలు వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షులు కట్టా నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్, జాతీయ తెలుగుదేశం పార్టీ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. సుమారు 30 వేల మంది భక్తులు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చి అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి, కార్యాలయ అధికారులు పర్యవేక్షించారు.

1 నుంచి వరలక్ష్మి వ్రత మహోత్సవాలు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ దేవస్థానం వద్ద శ్రావణమాసం సందర్భంగా సెప్టెంబర్ 1వ తేదీన శుక్రవారం ఉదయం సామూహిక శ్రావణ సౌభాగ్యం వరలక్ష్మి వ్రత మహెూత్సవములు జరుగుతాయని ఆలయ కార్య నిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. అనంతరం 12 గంటలకు వరలక్ష్మీ వ్రతం చేసుకున్న మహిళలకు దేవస్థానం వారు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి తెలిపారు. వ్రతము జరుపుకొను వారు ఈనెల 29వ తేదీ లోగా తమ పేర్లు నమోదు చేయించుకున్నచో వారికి వ్రత సామాగ్రి దేవస్థానం వారు ఉచితంగా అందిస్తారని, వారికి మాత్రమే ప్రవేశ ఉంటుందని తెలిపారు.

మందులు పంపిణీ

ప్రజాశక్తి-గుడివాడ : ఆదివారం స్థానిక మందపాడులోని నిరాశ్రాయుల కేంద్రంలో పెనుమోతు వంశీ అధ్వర్యంలో వృద్ధులకు ఉచితంగా బిపి, షుగర్, రక్త పరీక్షలు చేసి మందులు పంపిణి చేశారు. పెనుమోతు శ్రీనివాసరావు వర్ధంతిని పురష్కరించుకుని వృద్ధులకు ఉచితంగా రక్త పరీక్షలను డా.జాగేశ్వరరావు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎన్టిఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యులు లోయ ఈశ్వరవెంకటేశ్వరరావు, అర్జా ప్రసాద్, పొన్నూరు సత్యనారాయణ, లింగం చిట్టిబాబు, బొప్పన కుటుంబరావు, చింతా రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలని నిరసన

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని రాష్ట్రంలో ప్రతి పక్ష నాయకులను విమర్శిండం, సొల్లు కవుర్లు చెప్పాడం మానీ, ఓట్లు వేసి నాలుగు సార్లు గెలిపించిన ప్రజల సమస్యలపై శ్రద్ధ వహించాలని జనసేన నాయకుడు పాలంకి సారధి కోరారు. ఆదివారం స్థానిక పెదఎరుకపాడులోని వార్పు రోడ్డు పూర్తిగా గోతుల మాయం అయిన పట్టించుకోక వడంతో జనసేన నాయకులు పాలంకి సారధి అధ్వర్యంలో మునిగిపోయిన గోతిలో నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నాయకలు సందు పవన్, పేర్ని జగన్, రామిశెట్టి మురళీలతో కలసి సారధి మాట్లాడుతూ పెద్దఎరికి పాడులోని వార్పు సమీపంలో రోడ్డు గోతులు పడి నీరు చేరిందన్నారు. అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళిన పట్టించుకోలేదన్నారు. ఎంపి బాలశౌరి గుడివాడ నియోజవర్గంలో ఒక్క శంకుస్థాపనల కార్యక్రమాలకు మాత్రం వస్తారని

నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

విమర్శించారు. పెద్దఎరికిపాడులో వైసిపికి చెందిన అగ్రనాయకులు ఉన్న సమస్యలను పట్టించుకోరని విమర్శించారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు అర్జా కృష్ణ, పందిళ్ళ గణపతి ,షేక్ కరీం, చింతా రామకృష్ణ, వడ్డే గరి, కోట్టు శ్రీను, పండు తదితరులు పాల్గొన్నారు

అర్చన ఆసుపత్రి సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : స్థానిక బుట్టాయిపేట, ఎల్ఐసి పక్కన నూతనంగా అర్చన హాస్పిటల్స్ సేవలను ఆదివారం నుండి ప్రారంభించారు. ప్రఖ్యాత స్పెషాలిటీ డాక్టర్లు జి అర్చన మాధురి (చర్మ వ్యాధుల నిపుణులు), జి శశిధర్ (జనరల్, కిడ్నీ నిపుణులు), జి హరి కిషోర్ (చిన్నపిల్లల వ్యాధుల నిపుణులు) ఆసుపత్రిలో సేవలందిస్తారు. ఈ సందర్భంగా డాక్టర్ హరి కిషోర్ మాట్లాడుతూ ప్రారంభోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు ఉచిత ఓపి విభాగం ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ సదుపాయం కూడా కల్పించారన్నారు. కావున నగర ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బందరు నియోజకవర్గ యాదవ సేవా సంఘం అధ్యక్షులు పల్లపాటి వెంకట్రావు (చిన్నబాబు),

గొరిపర్తి రాము, గొరిపర్తి శ్రీనివాసరావు, గొరిపర్తి గోపాల్, గొరిపర్తి విశ్వనాథ్ బాబు, బొర్రా శ్రీనివాసరావు, బోయిన నాంచారయ్య ఆకుల ఆంజనేయులు, బట్రాజు శ్యామ్, డొక్కు వీరాంజనేయులు పాల్గొన్నారు.

బిఎల్ఒ విధుల నుంచి మినహాయించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఏమినిటీస్ సెక్రెటరీలను బి ఎల్ వో విధుల నుంచి మినహాయింపునివ్వాలని ఆంధ్రప్రదేశ్ డెమోక్రటిక్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు శివరామకష్ణ పేర్కొన్నారు. మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో పని చేస్తున్న ఎమినిటీస్ సెక్రటరిలు డెమోక్రటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నం తహసీల్దార్ శ్రీ విద్యని కలిసి తమకు బీ ఎల్ వో విధుల నుంచి పూర్తిగా మినహాయింపు నివ్వాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘ బాధ్యులు మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా కూడా పబ్లిక్ యుటిలిటీస్ వాటర్ ,లైట్స్, పవర్ మరియు ఇతరములకు సంబంధించి విధులు చేసే వారికి బిఎల్ఓ విధులు అప్పగించకూడదని స్పష్టంగా చెప్పిందని పేర్కొన్నారు. ఒక పక్క తమ విధులు నిర్వహించుకుంటూ బీ ఎల్ వో విధులు నిర్వహించడం ఇబ్బందిగా పరిణమించిన నేపథ్యంలో తమను బి ఎల్ వో లుగా తొలగించి విముక్తి కలిగించాలని విజ్ఞప్తి చేసారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆలీ మరియు ఇతర వార్డ్ ఎమినిటీస్ సెక్రటరీలు వినతి పత్రం అందించిన వారిలో ఉన్నారు.

యువ శాస్త్రవేత్త చైతన్య తల్లిదండ్రులకు సత్కారం

ప్రజాశక్తి-ఉయ్యూరు : భారత జాతి గర్వపడే అద్భుత విజయాన్ని సాధించిన చంద్రయాన్- 3 ప్రయోగంలో పాలు పంచుకున్న యువశాస్త్రవేత్త మధిర చైతన్య ఉయ్యూరుకు చెందిన వారు కావడం గర్వకారణమని బీసీ నాయకుడు రాజులపాటి రామచంద్రరావు, 16వ వార్డు కౌన్సిలర్ జంపాన పూర్ణిమ, 17వ వార్డు కౌన్సిలర్ రాజులపాటి నాగేంద్రప్రసాద్ (చిన్ని) అన్నారు. షార్లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న చైతన్య చంద్రయాన్ -3 ప్రయోగంలో రాకెట్ మె దటి స్టేజిలిఫ్ట్ చేసేందుకు ఓవరాల్ ఇన్చార్జ్ బాధ్యత చేపట్టి విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించడం పట్ల అభినందిస్తూ జనసాహిత్య అకాడమి ఆంధ్ర ప్రదేశ్ విభాగం అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం చైతన్య తలితండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామ చంద్రరావు, పూర్ణిమ, నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ పువ్వు పుట్టగనే పరిమళం వికసించునట్లు చైతన్య విద్యార్ధి దశనుడి చదువులో మంచి ప్రతిభ కనరపరచి ఇస్రో ప్రోత్సాహంతో

చైతన్య తల్లిదండ్రులను సత్కరిస్తున్న దృశ్యం

ఐఐటీ చదివి అదే సంస్థలో ఉద్యోగం చేస్తూ ప్రయోగాల్లో భూమిక పోషించడం అభినంద నీయమన్నారు. యాభైకు పైగా రాకెట్ లాంచింగ్ ప్రయోగాల్లో చైతన్య కషి అద్వితీయమని శ్రీనివాసగౌడ్ పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ కె.సాల్మన్ రాజు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ఏజీఅండ్ఎస్ఎస్ జూనియర్ కళాశాల డై రెక్టర్ వినయ్ కుమార్, గండిగుంట ఎంపీటీసీ బొల్లెద్దు రాజశేఖర్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. వెంకటేశ్వరరావు అభినందనల వెల్లువ ఇస్రో యువశాస్త్రవేత్త మధిర వెంకటేశ్వరరావుకు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. చంద్రయాన్ - 3 ప్రయోగం విజయవంతంలో భూమిక పోషించిన చైతన్యను అభినందిస్తూ ఉయ్యూరులో నివాసముంటున్న వెంకటేశ్వరరావుకు అభినందనల వెల్లువ సాగుతుంది.

కారు ఢీకొని వృద్ధుడు మృతి

కృష్ణమూర్తి (ఫైల్)

ప్రజాశక్తి - గుడివాడ : కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గుడివాడ రెండవ పట్టణ పోలీసుల కథనం ప్రకారం గుడివాడ స్లేటరుపేటలో నివాసముంటున్న సింగమనేని కృష్ణమూర్తి (77) ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో తన మొదటి కుమార్తె ఆర్టిసి కాలనీలో నివాసముంటున్న ఇంటికి సైకిల్పై వెళ్ళి తిరిగి వస్తుండగా పామర్రు రోడ్డులోని పెద్దకాలువ దాటి కెటిఆర్ మహిళా కళాశాల వద్దకు వచ్చే సరికి వెనుకగా వస్తున్న కారు కృష్ణమూర్తిని బలంగా ఢీకొట్టడంతో కింద పడిపోయాడు. తలకు, చెవికి బలంగా గాయాలవ్వడంతో హుటాహుటిన గుడివాడ ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. తలకు బలమైన గాయాలవ్వడంతో కృష్ణమూర్తి మృతి చెందాడు. మృతుడు గుడివాడ బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫోన్స్ డిఓటిగా పని చేసి పదవీ విరమణ పొందారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు రెండవ పట్టణ పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ బి తులసీధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ పి నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం

ప్రజాశక్తి-కోడూరు : డిగ్రీ విద్యార్థి అదశ్యమైన సంఘటన కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఏడవ వార్డులో చోటుచేసుకుంది. కోడూరు గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని శనివారం రాత్రి 10 గంటల సమయంలో వేరే గ్రామంలో జరిగే ప్రత్యేక ప్రార్థనలకు వెళతానని తల్లిదండ్రులు అడగగా వారు నిరాకరించడంతో మనస్థాపానికి గురై కోపంగా తన సైకిల్ ని తీసుకొని బయటికి వెళ్లిపోయినట్లు వారి కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తునట్లు కోడూరు ఎస్సై వి రాజేంద్రప్రసాద్ తెలిపారు. విద్యార్థిని సైకిల్ ఉల్లిపాలెం భవానీపురం వారిది పై ఉండటంతో తల్లిదండ్రులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం కష్ణ నది తీరం వెంబడి తమ సిబ్బందితో ప్రత్యేక బోట్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మత్స్యకారులకు అనుమానా స్పదంగా ఏమైనా కనిపించిన యెడల వెంటనే పోలీస్ వారికి తెలియచేయాలని ఎస్ఐ కోరారు.

యువకుడిపై దాడి

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలం పెదయాదర పంచాయతీ పరిధిలోని చిన్న యాదర హరిజన వాడలో నివాసం ఉంటున్న చాటగడ్డ విజయ కుమారుడు చాటగడ్డ గౌరీ కుమార్ పైన వైయస్సా ర్సీపి పార్టీకి చెందిన కొంతమంది యువకులు చెక్క మొద్దులతో తలపై తీవ్రమైన గాయాలు చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. ఈ కేసులో ఐపిసి 323, 324 సెక్షన్లు నమోదు చేయగా స్థానిక సర్పంచ్ గల్లా తిమోతి, మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకష్ణ , కష్ణా జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి లంకిశెట్టి బాలాజీ తదితరులు ఈ కేసుని హత్యాయత్నం కింద నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అమ్మినపురం అభివృద్ధికి కృషి



ప్రజాశక్తి-పమిడిముక్కల : వైయస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వమని అమ్మినపురం మాజీ మాజీ ఎంపీటీసీ పోరంకి వరప్రసాద్ (రాము) అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలు పేదలపాలిట వరాలని ఆయన అన్నారు. అమ్మఒడి, నాడు నేడు, రైతు భరోసా తదితర పథకాలతో పేదలు లబ్ధిపొందుతున్నారన్నారు. అమ్మినపురం గ్రామాభివద్ధి కట్టుబడి ఉన్నామని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మేలు జరుగుతోందన్నారు.

అన్నప్రసాదాన్ని రుచి చూస్తున్న చైర్మన్ కర్నాటి రాంబాబు

అన్నదాన విభాగం పరిశీలన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవ స్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానంలో నిత్యం జరిగే అన్నదానం విభాగాన్ని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా మహామండపం రెండవ అంతస్తులోని అన్నదానం హాలు నందు చైర్మన్ అన్నప్రసాదంలోని వంటకాలను పరిశీలించారు. అన్నప్రసాదం స్వీకరించిన భక్తులతో మాట్లాడి పదార్థాల రుచి, తదితరములు అడిగి తెలుసుకోగా భక్తులు సంతప్తిని వ్యక్తం చేశారు. చైర్మన్ స్వయంగా యాత్రికులకు వడ్డించి, అన్నప్రసాదం మరింత రుచిగా ఉండేలా చూడాలని సూచించారు. మహా మండపంలోని 2, 3 అంతస్తుల్లో క్యూలైన్లు, ఇతర ప్రదేశాలు పరిశీలించి శానిటేషన్ విభాగం వారు ఈ ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు.

కార్యక్రమం ప్రారంభిస్తున్న వక్తలు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నేటి ఆధునిక జీవన విధానంలో వాహనాల వినియోగం పెరిగి కాలుష్యం అధికమౌతుందని ఎస్ఎన్జీ ఫౌండేషన్ వ్యవస్థాప కురాలు శారదా వాణీ ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి వాటిని పరిరక్షిం చేందుకు కషి చేయాలన్నారు. సేవ్ ద నేచర్ బై గ్రోవింగ్ ట్రీస్ సంస్థ స్థాపించి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవాడ ఫన్ టైమ్ క్లబ్ లో నిర్వహించారు. నేడు మదర్ థెరిస్సా జయంతి పురస్కరించుకుని ప్రత్యేక నివాళులర్పించి మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం టెర్రాస్ గార్డెన్ చేస్తున్న వారికి అవార్డులు అందజేశారు. అనంతరం శారదా దేవీ మాట్లాడుతూ పొల్యూషన్ పెరిగిపోతున్న నేపథ్యంలో పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని అన్నారు. గతంలో 30 సెకన్లలో 1500 మొక్కలు నాటి రికార్డు సష్టించామని అదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని అన్నారు.

టివిఎస్ ఎక్సెల్ హెవీ డ్యూటీ ప్రదర్శన

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలోని ప్రతాప్ టీవీఎస్ షోరూం టీవీఎస్ ఎక్సెల్ హెవీ డ్యూటీ వాహ నాలను సందర్శకులు నిమిత్తం అమ్మకం, ప్రదర్శన రైతుబజార్ పక్కన ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసిస్టెంట్ గవర్నమెంట్ లీడర్ మట్టా ప్రసాద్, దళిత చైతన్య వేదిక అధ్యక్షులు కన్నెగంటి సజ్జనరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాహనం రైతులకు ఎలా ఉపయోగపడుతుంది. మల్టిపుల్ ఛాయిస్‌గా వ్యవసాయ పనులకు వ్యాపార పనులకు సాధారణ పనులకు ఉపయోగపడుతుందని, ఈ వాహనం ప్రతి ఒక్కరికి అవసరమని ఆయన వాహన యొక్క విశిష్టతను తెలిపారు. అనంతరం సజ్జనరావు సరదాగా డప్పు కొట్టి సందడి చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ఎగ్జిక్యూటివ్స్ మాట్లాడుతూ ప్రదర్శనకు విచ్చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రదర్శనలో పాల్గొన్న నిర్వాహకులు

సమరభేరి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చందర్లపాడు : స్థానిక సుందరయ్య భవనంలో అరిగెల చిన్న శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సమరభేరి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమాలు సైదులు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న బారాలకు వ్యతిరేకంగా విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని స్మార్ట్ మీటర్ల వద్దు, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, 400లకే గ్యాస్ ఇవ్వాలని, సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని, నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని, ధరల నియంత్రణ నిధి ఏర్పాటు చేయాలని, ప్రజా పంపిణీ ద్వారా కందిపప్పు, నూనె ఇతర సరుకులు సరఫరా చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు అమలు చేసి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.

వాల్‌పోస్టరు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు వివిధ రూపాల్లో జరిగే ఆందోళనలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ కార్యదర్శి ఎస్.కె హస్సాన్, ఎస్.కె ఉద్దండ్ సాహెబ్,కె సీతారావమ్మ, హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 50 డివిజన్లో మంచినీటి సరఫరా మెరుగుదల కోసం ఏర్పాటు చేసిన నీటి పైపులైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అప్పలస్వామి బెజ్జాల మేడ వీధి, బంక కామరాజు వీధి, గున్నాబత్తుల అచ్చయ్య వీధి ప్రాంతాల్లో మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని స్థానిక ప్రజలు కార్పొరేటర్ బి సత్యబాబు దష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌కి వినతి పత్రం ద్వారా ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అధికారులు స్పందించి పనులు ప్రారంభించారని తెలిపారు. గొల్లపాలెం గట్టు బూస్టర్ నుండి ఆరు అంగుళాల పైప్ లైన్ వేయులకు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. దీంతో జరుగుతున్న పనులను కార్పరేటర్ సత్యబబు పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరగా చర్యలు తీసుకోవాలని

పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

సిబ్బందికి తెలియజేశారు. మంచినీటి సరఫరా బురద రంగులో వస్తున్న దాన్ని సరిచేసి పరిశుభ్రమైన మంచినీటి సరఫరా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కి విజ్ఞప్తి చేయడం జరిగింది. మంజూరు చేసిన వాటర్ పైప్ లైన్ పనులు త్వరగా పూర్తిచేసి పైప్లైన్ లీకేజీని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సిపిఎం నాయకులు పి రాజు, జి నాగరాజు, బి శ్రీనివాసరావు, ఎస్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ యాప్ మోసంపై ఆందోళన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో (maersk) పేరుతో ఉన్న యాప్‌లో పెట్టుబడి పెట్టి సుమారు 2.5 కోట్లు నష్టపోయినట్లు బాధితులు గగ్గోలు పెడుతున్నారు. కొండపల్లికి చెందిన కృష్ణ అనే యువకుడి ద్వారా ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఎమ్ఎఇఆర్ ఎస్ కె.సంస్థ యాప్‌లో ఎంత పెట్టుబడి పెడితే 24 గంటల్లో పెట్టుబడికి రెట్టింపు వస్తుందనే ఆశతో ఈ ఆన్లైన్ యాప్‌లో రిజిస్టర్ అయినట్లు బాధితులు తెలియజేశారు. ఒకే కుటుంబంలో నలుగురి పేరుతో యాప్‌లో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. మొదట్లో వారం డబ్బులు డ్రా అయ్యేవి 1,500 నుండి 2,000 లోపు, ఆ తర్వాత రూ.40 లక్షలు, రెండు లక్షలు పెట్టుబడి పెట్టిన బాధితులకు డబ్బులు రావడం ఆగిపోయాయి. యాప్ పనిచేయడం ఆగిపోయింది. గత నెల రోజుల క్రితం నుండి యాప్‌లో డబ్బులు జమ చేయబడ్డాయని గత మూడు నాలుగు రోజుల నుంచి యాప్ పనిచేయడం లేదని గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం బెంగళూరులో నివాసముంటున్న కృష్ణ ఫోను అందుబాటులో లేకుండా పోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు ఆందోళన బాట పట్టారు. కొండపల్లి మీదుగా యాప్ పేరుతో కలిగిన కంటైనర్ వెళ్తుండగా గమనించిన బాధితులు కంటైనర్‌ను కొండపల్లి స్టేషన్ సెంటర్ వద్దకు తీసుకురాగా విషయం తెలుసుకున్న మిగతా బాధితులు సైతం గుంపులుగా వచ్చి కంటైనర్‌ను ఆపారు. ఈ విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేస్తామని చెప్పి కంటైనర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఇబ్రహీంపట్నం సీఐ పలివెల శ్రీను విచారిస్తున్నారు. అసలు ఈ కంటైనర్‌కు ఆ యాప్ కు సంబంధం ఉందా ? లేదా అనే అంశంపై దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. అయితే బాధితులు ఆపిన కంటైనర్ డ్రైవర్ ద్వారా మేనేజ్మెంట్ వారిని సంప్రదించిన పోలీసులు కంటైనర్ లాజిస్టిక్స్‌కు సంబంధించినది యాప్‌కు కంటైనర్‌కు సంబంధం లేదని సేకరించిన సమాచారం మేరకు బాధితులు సైబర్ క్రైమ్ విభాగాన్ని సంప్రదించాల్సిందిగా కోరారు.

ప్రజలకు అన్నీ అవస్థలే

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నగరంలో వైసీపీ పాలనలో ప్రజలకు అన్నీ అవస్థలేనని, ప్రజా సమస్యలను పాలకులు గాలికి వదిలేస్తు న్నారని జనసేన పశ్చిమ ఇన్‌ఛార్జి పోతిన వెంకట మహేష్ విమర్శించారు. ఆదివారం 51వ డివిజన్‌లో చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి నేమాని సంజీవరావు ఆధ్వర్యంలో కొత్తపేట, పోతిన ఆదయ్య వీధి కొండ ప్రాంతాల్లో ఆయన పర్య టించారు. ఈ సందర్భంగా మహేష్ మాటా ్లడుతూ వాటర్, డ్రైనేజ్ మరియు ర్యాంప్ వంటి సమస్యలతో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి మండలం కన్నెవీడు గ్రామస్తులు ఎల్.వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి దంపతులు రూ.1,00,116/- లు మరియు పెదకాకాని వాస్తవ్యులు కోటి హనిమిరెడ్డి, లక్ష్మి రమాదేవి దంపతులు రూ.10,116/- లు విరా ళంగా అందజేసిన్నారు. దాతలకు శ్రీ స్వామి వారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పసుపులేటి రాధా సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి సి.జయ ప్రకాశ్ బాబు తెలిపారు.

అమ్మవారి సారె ఊరేగింపులో పాల్గొన్న వెలంపల్లి శ్రీనివాస్

సారె ఊరేగింపు

ప్రజాశక్తి - అజిత్‌సింగ్ నగర్ : శ్రావణమాసం వచ్చిందంటే నగరంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుంది. ఈ క్రమంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య సేవా సంఘం స్థానిక 61వ డివిజన్ అధ్యక్షులు పేరం కష్ణ దంపతుల ఆధ్వర్యంలో శ్రీ వాసవి అమ్మవారికి శ్రావణమాస సారె ఊరేగింపు మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం మంగళ వాద్యాల నడుమ, వందల సంఖ్యలో ముత్తైదువులు, చిన్నారులు, మహిళలు డప్పులతో కోలాటం చేస్తూ పుర వీధులలో తిరుగుతూ అమ్మవారికి శ్రావణమాస సారె సమర్పించారు. ఈ ఊరేగింపులో పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆదమరిస్తే అంతే !

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని షేర్ మహమ్మద్ పేట నుండి గంప్రాయి వెళ్లే రోడ్డు గుంటలు పడి ప్రమాదభరితంగా ఉంది. షేర్ మహమ్మద్ పేట సెంటర్ నుండి చెరువు అలుగు దాటే వరకు రోడ్డు గుంటలు గుంటలుగా ఉండి మరి అధ్వానంగా తయారయింది. చెరువు చప్టా వద్ద రోడ్డు ఒకటిన్నర అడుగుల మేర కుంగి పోయింది. ఈ గుంటలో ద్విచక్ర వాహనలు, ఆటోలు దిగితే పడిపోయే ప్రమాదం ఉంది. వర్షం వస్తే రోడ్డు మొత్తం చిత్తడిగా మారి ప్రయాణం మరింత ప్రమాద కరంగా ఉంటుంది. గత వేసవిలో చెరువు మట్టి ఈ రోడ్డు గుండా పంట పొలాలకు, ఇటుక బట్టిలకు భారీ మొత్తంలో మట్టి త్రవ్వకాలు చేపట్టారు. దీంతో చెరువు మట్టి ఈ రోడ్డుపై పడిపోయి, రోడ్డు మొత్తం గుంటలు పడింది. బంక మట్టి రోడ్డుపై పడిపోవడంతో వర్షం వస్తే రోడ్డు మొత్తం చిత్తడిగా మారి పోయింది. ఇక ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. గతంలో ఈ రోడ్డుపై వర్షం వచ్చిన సమయంలో రోడ్డు చిత్తడిగా మారి ద్విచక్ర వాహనాలు, ఆటోలు సైతం పడిపోయి ప్రమాదాలు జరిగిన దాఖలాలు ఉన్నాయి.

సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు : షేర్ మహమ్మద్ పేట,

గంప్రాయి రోడ్డు వర్షం వచ్చినప్పుడు చెత్తడిగా మారి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుపై గుంతలు పడిపోయి ప్రయాణికులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకం అనుభవించాల్సి వస్తుంది. దీంతో సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు రోడ్డుపై నాట్లు వేసి రోడ్డు నిర్మించాలని కోరుతూ నిరసన తెలిపారు. రోడ్డును నిర్మించాలని కోరుతూ రోడ్లు, భవనాలు శాఖ డిఇని కోరారు. అంతేకాక గత సోమవారం స్పందన కార్యక్రమంలో తహశీల్దార్‌కు రోడ్డు నిర్మించాలని వినతిపత్రం అందజేశారు.

బిబి రోడ్డు నిర్మాణానికి 2.5 కోట్లు మంజూరు: ఆర్ అండ్ బి డీఇ టి. పరశురాముడు

షేర్ మహమ్మద్ పేట నుండి గంప్రాయి వరకు రోడ్డు నిర్మాణానికి 2.5 కోట్లు నిధులు మంజూరు అయినట్లు ఆర్ అండ్ డిఇ టి.పరశురాముడు తెలిపారు. ఈ రోడ్డుకు షేర్ మహ్మద్ పేట నుండి సుమారు ఎర్ర కాలువ బ్రిడ్జి వరకు 500 మీటర్లు వరకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టి తర్వాత అక్కడ నుండి తారు రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ రోడ్డుకు త్వరలో టెండర్లు పిలిచి అనంతరం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి, రోడ్డు నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఈ తెలిపారు.

మౌలిక వసతుల్లేవు... స్పెషలిస్టులూ లేరు..

• గన్నవరం ప్రభుత్వాసుపత్రి దుస్థితి

ప్రజాశక్తి-గన్నవరం : ఆదివారం వస్తే గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు ఉండడం లేదు. ఏదైనా ఎమర్జెన్సీ కేసు వస్తే అప్పుడు డాక్టర్ కు ఫోన్ చేస్తే వచ్చే పరిస్థితి. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకే డాక్టర్లు ఉంటారు. ఆ తర్వాత చూద్దామన్నా డాక్టర్లు కనిపించరు. రాత్రివేళ ఏదైనా కేసు వస్తే వెంటనే విజయవాడ తీసుకువెళ్లిపోమని సిబ్బంది చెబుతున్నారు. ఎమ్మెల్యే కార్యాలయం ఎదురుగా, జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ఇది. ప్రభుత్వం చిన్న చూపు వల్ల ఈ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పన జరగడం లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఆసుపత్రి అభివృద్ధికి రూపాయి కూడా కేటాయించని పరిస్థితి. ఆసుపత్రి బడ్జెట్ ను కూడా వేరే వాటికి తరలించారు. దీనికి తోడు ఈ ఆసుపత్రిలో స్పెషలిస్టులు లేరు. సాధారణ వైద్యులతోనే నడక సాగుతోంది. ఇది 40 పడకల ఆసుపత్రి. నిత్యం జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లో గాయపడిన రోగులను ఇక్కడకు తీసుకువస్తారు. అదేవిధంగా గన్నవరం మండలంలోని 10 గ్రామాల నుంచి వైద్యం కోసం జనం రోజు ఆసుపత్రికి వస్తారు. ఓపి 300 నుంచి 400 వరకు ఉంటుంది. ఆరుగురు డాక్టర్లు ఉన్నారు. అందరూ సాధారణమైన డాక్టర్లే. స్పెషలిస్టులు లేరు. నార్మల్ కాన్పులు చేయడం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయడం వరకే ఈ ఆసుపత్రి పరిమితమైంది. ఏదైనా ఆపరేషన్ చేయాల్సి వస్తే వెంటనే అంబులెన్స్ లో విజయవాడ పంపేస్తున్నారు. రోగుల బాధలు వర్ణాతీతంగా ఉన్నాయి. ఈ ఆసుపత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్, ఆర్థోపెడిక్, సర్జన్ పోస్టులు కావాల్సి ఉంది. వాటిని భర్తీ చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదు. ఇంకా విచిత్రం ఉంటే ప్రస్తుతం పనిచేస్తున్న డాక్టర్లకు చూడడానికి రూములు కూడా లేని పరిస్థితి ఇక్కడ ఉంది. ఇబ్బందులతో రోగులను చూసి పంపుతున్నారు డాక్టర్లు. మౌలిక వసతుల కల్పన కోసం కొత్త భవన సముదాయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం తక్షణంగా ఉంది. అందుకోసం కోటి రూపాయలు కావాలని ఎమ్మెల్యే ప్రతిపాదించారు. దీనికి తోడు పెద్ద ఎక్సరే మిషన్ ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా ఆదివారం డాక్టర్లు రాకపోవడంతో సిబ్బంది డాక్టర్లు గా మారి రోగులకు చికిత్సలు చేసి పంపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆసుపత్రిలో స్పెషలిస్టులతోపాటు మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి భవనం

డాక్టర్ రాకపోవడంతో చికిత్స చేస్తున్న నర్సు

ప్రభుత్వం నిధులు కేటాయించాలి.. మన్నే సుందర్రావు, ఆసుపత్రి అభివద్ధి కమిటీ చైర్మన్

ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి. మంచినీటి సదుపాయం కోసం మరో బోర్వెల్ ను నిర్మించాలి. కరెంటు సమస్యను పరిష్కరిం చాలి. ఆసుపత్రి అభివద్ధి కమిటీ లో ఉన్న నిధులను ప్రభుత్వం వేరే అవసరాలకు వాడుకోంది. ఆ తర్వాత నిధులు సమకూర్చలేదు. ఫలితంగా ఆసుపత్రిలో కరెంటు పోతే రిపేరు చేయించడానికి రూపాయి లేని పరిస్థితి. చైర్మన్ గా ఉన్నందుకు తానే సొంత డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. స్పెషలిస్టులను భర్తీ చేయాలి. ఈ సమస్యలను ఎమ్మెల్యే వంశీ దష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఆయన ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లారు. అయితే పనులు జరగాల్సిన అవసరం ఉంది.

పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారం-2024 కోసం ఆన్లైన్లో ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ న్యూఢిల్లీ సభ్య కార్యదర్శి కమల్ కిషోర్ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి రోజున ఈ పురస్కారాలు ప్రకటిస్తారన్నారని కలెక్టర్ వివరించారు. విపత్తుల నిర్వహణ రంగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు ఈ పురస్కారాలు అందజేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు పత్రాలు సమగ్ర వివరాలు https://awards.gov.in అనే వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కావున జిల్లాలో ఎవరైనా విపత్తుల సందర్భంగా విశేష సేవలు అందించిన వ్యక్తులు ఈనెల ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

వెండి మకర తోరణం బహూకరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక సంతరోడ్డులో గల శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారికి భక్తులు సమర్పించిన ఐదు లక్షల విలువ గల వెండి మకర తోరణాన్ని ఆదివారం స్వామివారికి అలంకరించారు. అలాగే వెండి శంఖమును గుడ్లవల్లేరు కు చెందిన నాగినేని వెంకయ్య బహుకరించగా, ఉత్సవమూర్తికి వెండి కుండ కిరీటమును కొమరవోలు వెంకటేశ్వరరావు సుబ్బమ్మలు బహుక ́రించారు. వెండి తీర్థ పాత్ర వద్దంకిని నందివాడ గ్రామానికి లక్ష్మీ రాజ్యం, ఆంజనేయునికి ఉత్సవమూర్తి కిరీటమును చిట్టూరి రామశాస్త్రి బహూరించినట్లు తెలిపారు. వీటిని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా అలంకరించినట్లు ఆలయ కమిటీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పట్టని ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి-కోడూరు : రైతాంగ సమస్యలను పట్టించు కోని ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది వైసిపి ప్రభుత్వం మాత్రమే అని జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ విమర్శించారు. కోడూరు మండలంలోని జరుగువానిపాలెం, మందపాకల గ్రామాల పరిధిలో ఆయన ఆదివారం పర్యటించి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. కాలవల్లో సాగునీరు సరిగా రావటం లేదనీ కనీసం ఆయిల్ ఇంజన్లకు కూడా నీరు అందని స్థితిలో వ్యవసాయం చేసుకోలేకపోతు న్నామని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏ రైతును పలకరించి పరిస్థితి ఏమిటి అని అడిగితే తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇంజన్లకు సాగునీరు అందని దుస్థితిలో రైతు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రైతాంగ సమస్యలు ఏమి ఎమ్మెల్యేకు, నరసింహారావుకు పట్టవు అని విమర్శించారు. రైతులను పట్టించుకోవాల్సిన బాధ్యత అధికార పక్షానికి లేదా అని వెంకట్రామ్ నిలదీశారు. ఇప్పటికైనా కళ్ళు తెరవాలని రైతుకు అండగా నిలవాలని కోరారు. ఎంతసేపూ బుద్ధప్రసాద్ ని విమర్శించేందుకు ప్రెస్ మీట్ లు పెట్టడం కాదనీ అధికారులతో సమావేశాలు నిర్వహించి రైతులను ఏ విధంగా ఆదుకుంటారు, నీరు ఎలా ఇస్తారో ఇవ్వగలరో ప్రెస్ మీట్ ద్వారా తెలియచేయాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బండే శ్రీనివాసరావు, కోడూరు మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

బహుమతులు సర్టిఫికెట్లు అందజేసిన ఎమ్మెల్యే రమేష్ బాబు

బహుమతులు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈషా సంస్థ తరఫున నిర్వహిస్తున్న గ్రామోత్సవ క్రీడల పోటీల్లో భాగంగా ఆదివారం అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రో బాల్ పోటీలు నిర్వహించారు. వీరితోపాటు చిన్నారులకు కూడా అనేక రకాల ఆటలు పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో వాలీబాల్ లో 20 టీములు పాల్గొనగా త్రోబాల్లో 19 టీములు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు నగదు బహుమతులు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఈశా ఫౌండేషన్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్త వాలంటీర్స్ మాట్లాడుతూ క్రీడా ప్రాంగణాన్ని వినియోగించు కోవడానికి అవకాశం కల్పించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి ఉమారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి ఎన్ బి గోపాలకు ధన్యవాదాలు తెలిపారు. వాలీబాల్ లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.9000, ద్వితీయ బహుమతిగా రూ.6000, తతీయ బహుమతిగా రూ.3000, నాలుగో బహుమతిగా రూ.2000 రూపాయలు అందజేశారు.

హరీషా నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని దోసపాడు గ్రామానికి చెందిన మూల్పూరి హరీషను వైసిపి జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా వైసిపి అధినేత ఏపీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్కుమార్కు హరీష ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ను గతంలో కంటే అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి తన శక్తి వంచన లేకుండా కషి చేస్తానని అన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం కొడాలి పిఏసియస్ ఛైర్మన్ పరుచూరి రామకష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో కోపరేటివ్ బ్యాంకు ప్రాంగణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రేలంగి శిరీష పాల్గొని సొసైటీ సభ్యులు, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 130 మందికి కళ్ళజోళ్లను కోపరేటివ్ బ్యాంకు సహకారంతో ఉచితంగా అందించగా, ఆరుగురు వ్యక్తులను కంటి ఆపరేషన్ ఏలూరు ఆశ్రమ ఆసుపత్రిలో చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మల మురళీకష్ణ, ఘంటసాల ఎఎంసి ఛైర్మన్ వేమూరి వెంకట్రావు, కొత్తపల్లి పిఏసీఎస్ ఛైర్మన్ తాతినేని కష్ణారావు, వైసీపీనేత పడమట వీర కుమార్, కొడాలి పిఏసీఎస్ సెక్రటరీ తుమ్మల ఆదినారాయణ, పిఆర్వో గణేష్, ఏఎన్ఎమ్ చిత్ర, పిఏసీఎస్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఇసుక అక్రమ రవాణాపై నిరసన

ప్రజాశక్తి-ఘంటసాల : శ్రీకాకుళంలో జరుగుతున్న ఇసుక అక్రమ మైనింగ్పై సోమవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు పేర్కొన్నారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం గ్రామంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను, స్టాక్ నిల్వలను పరిశీలించి ఆక్రమ తవ్వకాలు, ఇసుక అధిక ధరలకు విక్రయాలకు నిరసనగా నిరసన తెలియజేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు విరివిగా పాల్గొనాలని తెలిపారు.

మహాశక్తిపై కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలం పోతిరెడ్డి పాలెం పంచాయతీ, శ్రీనివాస్ నగర్ లో ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో మహాశక్తిపై కరపత్రాలు పంపిణీ చేశారు. నియోజక వర్గ మహిళ అధ్యక్షురాలు లంకిశెట్టి నీరజ, పట్టణ మహిళ అధ్యక్షరాలు నలిగిలి వసంత, కార్పొరేటర్ దేవరపల్లి అనిత, నారగానీ వాణి, మోదుగుముడి పద్మ, లతీపున్నిషలు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టో వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు కుంచే నాని, క్లస్టర్ ఇంచార్జ్ తలారి సోమశేఖర్, మేక గంగాధర్, భుసరపు ఆంజనేయులు, మేక సురేష్, యూనిట్ ఇంచార్జ్ బత్తిన నాగరాజు, కుంభ రామస్వామి, కాగిత ఆది శేషులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

'శ్రీ భ్రమర బ్యాంకర్స్ కాలనీ' ప్రారంభం

విజయవాడ: అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విజయవాడ నగరానికి దగ్గరలో గుంగూరు వద్ద 'శ్రీ భ్రమర బ్యాంకర్స్ కాలనీ' ప్రాజెక్టును శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ భ్రమర టౌన్ షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గళ్లా రామచంద్రరావు మాట్లాడుతూ కోవిడ్-19 సంక్షోభం వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు, వ్యాపార సంస్థలకు బ్యాంకర్లు అందించిన సహకారం, సమాజం పట్ల వారు చూపించిన అంకిత భావానికి గుర్తుగా వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ బ్యాంకర్లు, ప్రభుత్వ అధికారుల కోసం ప్రత్యేకంగా ఒక ప్రాజెక్టు చేపట్టాలని తలపెట్టినట్లు చెప్పారు. క్లబ్ హౌస్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, రిక్రియేషన్ సెంటర్, ఓపెన్ యాంఫీ థియేటర్, ఔట్ డోర్, ఇండోర్ గేమ్స్, విశాలమైన రోడ్లు, లేఅవుట్ చుట్టూ ప్రహరీ గోడ, అండర్ గ్రౌండ్ కేబుల్స్, డ్రైనేజ్ వంటి ఎన్నో అత్యాధునిక సౌకర్యాలతో, 12.5 ఎకరాల్లో పచ్చని పరిసరాల మధ్య, ప్రశాంత వాతావరణంలో, అన్ని రకాల అనుమతులతో, సమకాలిన వాస్తుతో, అత్యంత నాణ్యతతో, విశాలమైన 84 సింప్లెక్స్ ఇండిపెండెంట్ గృహాల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. గడిచిన ఏడేళ్లలో ఏడు వేల కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చి,

వినియోగదారుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నామన్నారు. అన్ని రకాల సౌకర్యాలకు చేరువలో, నివాసయోగ్యమైన ప్రాంతాలను ఎంచుకొని, అన్ని రకాల అనుమతులతో, నూరు శాతం వాస్తును పాటిస్తూ, సకల సదుపాయాలతో, శ్రేష్ఠమైన, విలాసవంతమైన గృహాలను అందించడం శ్రీ భ్రమర ప్రత్యేకతన్నారు. కృష్ణా, గుంటూరు, ఎన్‌టిఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 30కి పైగా ప్రాజెక్టులను దిగ్విజయంగా ముగించి స్థిరాస్తి రంగంలో తమదైన ముద్ర వేసుకుని రాష్ట్రంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఒకటిగా శ్రీ భ్రమర టౌన్ షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుగాంచిందన్నారు. అనంతరం శ్రీ భ్రమర బ్యాంకర్స్ కాలనీ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ మారం చంద్రశేఖర్, డైరెక్టర్ ఎం.ఎస్.రాజు, డైరెక్టర్ శైలారెడ్డి కోట, డైరెక్టర్ యడ్లపల్లి మురళీకృష్ణ, డైరెక్టర్ రావెల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విజయవాడ: వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఎ.కొండూరులోని కుమ్మరికుంట్ల గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరం వైద్య బృందం పాల్గొని 215 మందిని పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జి.రశ్మి, డాక్టర్ బి. స్వర్ణలత, డాక్టర్ సునీల, డాక్టర్ శ్రీ నవ్య, వాసవ్య నాబార్డ్ ప్రాజెక్ట్ మేనేజరు కె.శ్రీనివాసరావు, ఆప్తమెట్రిస్ట్ ఫిరోజ్ బాషా పాల్గొన్నారు.

అధిక ధరలు, నిరుద్యోగంపై సిపిఎం సమరభేరి

సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-సింగ్‌నగర్: అజిత్ సింగ్‌నగర్, శాంతి నగర్, రాజీవ్ నగర్ ప్రాంతాలలో సిపిఎం సమరభేరి కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. పెరిగిన ధరలకు వ్యతిరేకంగా సంతకాలు సేకరించారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ మోడీ తొమ్మిదేళ్ల కాలంలో ధరలు పెంచి ప్రజల జీవితాలను అతలాకుతలం చేశారన్నారు.. జీఎస్టీ పేరుతో ఇటు సాధారణ ప్రజలను, అటు వ్యాపారుల నడ్డి విరిచారన్నారు. బియ్యం, ఆహార వస్తువులు, పాల ఉత్పత్తులతో సహ దేనిని వదిలిపెట్టకుండా జిఎస్టి విధించారన్నారు. పెట్రోల్, డీజిల్‌పై విపరీతమైన సెస్సులు, టాక్సులు పెంచి దాదాపు 25 లక్షల కోట్ల రూపాయలు ప్రజలను పీడించి వసూలు చేశారని విమర్శించారు. వంట గ్యాస్‌పై సబ్సిడీని కుదించి గ్యాస్ సిలిండర్‌ని 400 నుండి 1200 రూపాయలకు పెంచారన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మోడీ సర్కార్‌తో జతకట్టి ప్రజలను పీల్చి పిప్పి చేస్తుందన్నారు. విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా చెత్త పన్ను విధించారన్నారు. ప్రతి సంవత్సరం ఇంటి పన్నులు పెంచుతున్నారన్నారు. ఇసుకను వ్యాపార సరుకుగా మార్చేశారన్నారు. బియ్యం ధరలు విపరీతంగా పెరిగాయని, కూరగాయలు మొదలు ఉల్లిపాయల వరకు అన్ని రేట్లు పెరిగాయన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుగార్చాయని విమర్శించారు. కందిపప్పు సరఫరా నిలిపివేశారన్నారు. పామాయిల్ ఏనాడో ఎత్తివేశారన్నారు. సన్న బియ్యం హామీ అమలు జరగలేదన్నారు. అభివృద్ధి కుంటుపడిందని, ఉపాధి అవకాశాలు లేవని, గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం కోత పెట్టిందని అన్నారు. పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టాలని కోరుతున్నా పట్టించుకోవటం లేదన్నారు. రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్ ఊసే లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. నామినేటెడ్ పోస్టులు మాత్రం వారి నాయకులతో నింపుకుంటున్నారని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అంటూ ఊరించిన మోడీ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా దగా చేశారని విమర్శించారు. ధరలు, పన్నుల భారాల పెంపు, నిరుద్యోగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా సిపిఎం దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. రాష్ట్రంలో దశలవారీగా నాలుగో తేదీ వరకు ప్రచార ఉద్యమం సాగుతోందన్నారు. ఇంటింటికి సంతకాల సేకరణ, కరపత్రాలు పంపిణీ, సచివాలయాల వద్ద విద్యుత్ బిల్లుల దగ్ధం, నాలుగో తేదీన ప్రభుత్వ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు బి.రమణారావు, సిహెచ్.శ్రీనివాస్, నిజాముద్దీన్, సాంబిరెడ్డి, అరుణ, అమ్ములు, నాగమ్మ, పవన్, రమేష్, మారుతి శ్రీనివాస్, దుర్గారావు, ఎన్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న బాబూరావు

మొదటిపేజీ తరువాయి

స్వయం సహాయ సంఘాల అభివృద్ధికి కృషి

17,993 గ్రూపులకు 1,164 కోట్ల 57 లక్షలు రుణాలు మంజూరయ్యాయి.

ప్రశ్న: ఏపి పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరింది?

జవాబు: వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో నాలుగు విడతల్లో 3,03,554 మంది గ్రూపు సభ్యులకు రూ. 125.42 కోట్లు అందించాం. వైఎస్సార్ ఆసరా పథకంలో పొదుపు సంఘాల్లో మహిళలు 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి బ్యాంకుల్లో తీసుకున్న అప్పు నిల్వ మొత్తము నాలుగు దఫాలుగా లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది. ఇప్పటి వరకు మూడు విడతల్లో 3, 28, 925 మంది సభ్యులకు రూ.744 కోట్ల 56 లక్షలు అందించింది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 45 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల ఎస్.సి, బిసి, మైనార్టీ వర్గాల మహిళలకు ఏటా రూ. 18, 750 చొప్పున నాలుగేళ్లు రూ. 75 వేలు ఆర్థిక సాయం అందించడం జరుగుతోంది. ఈ పథకంలో మూడు విడతల్లో లక్ష మంది లబ్ధిదారులకు రూ. 562 కోట్లు లబ్ధి చేకూరింది.

ప్రశ్న: డ్వాక్రా గ్రూపు మహిళలు గృహ నిర్మాణాలకు బ్యాంకు రుణాలు మంజూరు అయ్యాయా?

జవాబు: నవరత్నాలు పేదలందరికి ఇళ్లు పథకంలో జిల్లాలో మొదటి విడతగా జిల్లాలోని 33,969 మంది లబ్ధిదారులకు ఇల్లు కట్టించి ఇచ్చే క్రమంలో డిఆర్‌డిఎ, వైఎస్సార్ క్రాంత పథం ద్వారా ప్రతి ఇంటికి రూ. 35 వేలు ఇనిషియల్ మొబలైజేషన్ అడ్వాన్స్ కింద మంజూరు చేయడం జరిగింది. ఇప్పటి వరకు 26, 621 మంది లబ్ధిదారులకు రుణాలు అందించాం. మిగిలిన వారికి త్వరలోనే అందిస్తాం.

ప్రశ్న: ఉన్నతి పథకం అమలవుతోందా?

జవాబు: ఈ పథకంలో పేద, నిరుపేద ఎస్, ఎస్‌టి కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి పెంచడానికి కృషి జరుగుతోంది. వారి ఆర్థిక అభివృద్ధికి వడ్డీ లేని రుణాలు మంజూరవుతున్నాయి. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు అర్హులైన ఒక్కొక్కరికి రూ. 25 వేలు నుండి రూ.50 వేలు మంజూరు చేస్తున్నాం. ఈ పథకంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 1856 మందికి 8 కోట్ల 95 లక్షల 22 వేలు మంజూరు చేయడం జరిగింది.

ప్రశ్న: పరివర్తన్‌లో ఎందరికి జీవనోపాధి కల్పించడానికి కృషి జరిగింది?

జవాబు: నాటుసారా తయారు చేస్తున్న మహిళలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కోసం వివిధ చిరువ్యాపారాలపై అవగాహన కల్పిస్తున్నాం. వారు చేయగలిగిన వ్యాపారానికి బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తున్నాం. ఈ పరివర్తన్‌లో భాగంగా బంటుమిల్లి మండలంలో 3, గూడూరులో 5, కృత్తివెన్ను 10 మంది, మచిలీపట్నం 6, పెడనలో 12 మందికి మొత్తం ఐదు మండలాల్లో 36 మంది మహిళలకు రూ. 24 లక్షల 10 వేలు రుణాలు మంజూరు చేయించాం. స్త్రీ నిధి బ్యాంకు లింకేజీ ద్వారా ఒక్కొక్కరికి రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు రుణాలు అందాయి.

ప్రశ్న: మహిళా మార్టులు విస్తరిస్తున్నారా?

జవాబు: మహిళా మార్టుల్లో అన్ని రకాల సరుకులు అమ్మకాలు జరుగుతున్నాయి. జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. అవనిగడ్డ కేంద్రంగా ఒకటి ఏర్పాటైంది. త్వరలోనే పెడనలో మరొకటి ప్రారంభిస్తున్నాం. ఆ తర్వాత గన్నవరం, నాగాయలంక, మొవ్వ, పామర్రు ప్రాంతాలకు విస్తరిస్తాం.

ప్రశ్న: గ్రూపుల్లో అవినీతి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: అవినీతి, అక్రమాలకు పాల్పడితే సహించం. సంఘాల లావాదేవీలకు సంబంధించి ఆడిట్ నిర్వహిస్తున్నాం. అవినీతికి పాల్పడిన కొందరిపై చర్యలు తీసుకున్నాం. ఇంకా ఆడిట్ కొనసాగుతోంది.

ధరలు తగ్గించండి

పరిష్కారానికి సెప్టెంబర్ 4న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బి.సత్యబాబు, కార్యదర్శివర్గ సభ్యులు గాదె ఆదిలక్ష్మి, నగర కమిటీ సభ్యులు ఐ.వి.నారాయణ, ఎస్.సుబ్బారెడ్డి, జి.బాలదుర్గారావు, జి.నాగరాజు, జి.సుబ్బారెడ్డి, కె.నాని, పి.మహేష్, ఎ.ఆనంద్, వి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉదాసీనత

హెల్త్‌కార్డు ఇప్పించి, ప్రతి మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించాలి. డ్రైవర్ లైసెన్సును స్కూల్ యాజమాన్యం తప్పక తనిఖీ చేయాలి. డ్రైవర్ వివరాలను పేరెంట్స్ కమిటీకి అప్పగించాలి. సురక్షిత ప్రయాణం కోసం డ్రైవర్లకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. ప్రతి బస్సులో ప్రయాణించే విద్యార్థుల అటెండెన్స్ తీసుకోవాలి. ప్రతి బస్సుకు ఎడమ వైపు, వెనుక స్కూల్ పేరు, చిరునామా, ఫోన్ నెంబర్లు రాయాలి. ప్రతి నెల స్కూల్ ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ తప్పనిసరిగా బస్సులను తనిఖీ చేయాలి. బస్సు నిర్వహణపై రిజిస్టర్ ఏర్పాటు చేయాలి. డ్రైవర్ వద్ద ఫిర్యాదు పుస్తకం ఉండేలా పాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలి. బస్సుల్లో అత్యవసర ద్వారాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, సైడ్ అద్దాలు ఉండేలా చూసుకోవాలి. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదు. బస్సుకు సంబంధించి బ్యాటరీ, వైపర్స్, రెండువైపులా ఇండికేటర్లు పని చేసేలా చూసుకోవాలి.

బిజెపి విధానాలను ఐక్యంగా తిప్పికొడదాం

తీర్మానాన్ని కె.నాగమణి ప్రవేశపెట్టారు. సిఐటియు ఆఫీస్ బేరర్స్ జి.బేబీరాణి, సుబ్బారావమ్మ, డి.రమాదేవి, కె.ధనలక్ష్మి స్టీరింగ్ కమిటీగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసి వర్కింగ్ ఉమెన్స్ స్టేట్ కన్వీనర్ సూర్యప్రభ, యుటిఎఫ్ రాష్ట్ర నాయకురాలు పోశమ్మ, కమల, దయామణి, విజయలక్ష్మి, లక్ష్మి, ఇందు, దయా రమాదేవి, సిహెచ్ పద్మ, వాణిశ్రీ, నాగమణి, లక్ష్మీదేవి, అన్నపూర్ణ, పి.మణి, కృష్ణవేణి, వాణిశ్రీ, శివకుమారి, దిల్షాద్, రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి 24 రంగాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్ యార్డులా ఆగిరిపల్లి రోడ్డు

• తీవ్ర దుర్గంధంతో స్థానికుల ఇబ్బందులు • డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరం - ఆగిరపల్లి రోడ్డును డంపింగ్ యార్డు చేశారు అధికారులు. కుప్పలుగా చెత్త పారేయంతో వానలు పడి చెత్త కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అగిరపల్లి రోడ్డుపై వెళ్తున్న వారు వాంతులకు గురువుతున్నారు. జిల్లా కలెక్టర్ గొల్లనపల్లిలో చెత్త డంపింగ్‌కు స్థలం కేటాయించ కుంటే మరింత దారుణంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. డయేరియా, డెంగ్యూ వంటి రోగాల బారిన గన్నవరం, ఆగిరపల్లి రోడ్డుపై వెళ్లే మెట్ట గ్రామాల ప్రజలు పడతారని ఆందోళన చెందుతున్నారు. నిజం చెప్పాలంటే ఆ రోడ్డుకి రెండు వైపులా ఎటు చూసినా చెత్తా, చెదారమే కనిపిస్తోంది. రైతుబజార్లో చెత్త కుప్పలు పేరుకు పోయాయి. కోట్ల రూపాయలు ఖర్చులు పెడుతున్న పంచాయతీ ఈ చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు తీసు కోవడం లేదనే వాదనుంది. ఇక మురుగు కాల్వల్లో నీరు పారడం లేదు. దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు ఉదతి చెందడంతో జనాలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. పిల్లలు అంటు రోగాల భారిన పడు తున్నారు. పారిశుద్ధం అధ్వాన్నంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. మురుగుతో నానా అగచాట్లు ప డుతున్నారు. శ్రీనగర్ కాలనీ, గౌడపేట, కొత్తపేట, ముస్లింపేట, చింతలపేట ఏరియాల్లోని డ్రైనేజీలు చె త్తతో నిండిపోయాయి. మురుగు నీరంతా రోడ్డుపైకి వస్తుందని జ నాలు చెబుతున్నారు. ఇళ్లలో వాడిన నీరంతా కాల్వలోకి వచ్చి పారకుండా నిలిచిపోతుంది. రోజుల తరబడి నిల్వ ఉండటంతో నీరంతా రం గుమాని దుర్వాసన వస్తుందని, పందులు స్వైర విహారం చేస్తున్నా యని చెప్పారు. ఆగిరపల్లి రోడ్డులో ఎక్కడపడితే అక్కడ చెత్త పారేస్తు న్నారు. కొనాయి చెరువు వద్ద చెత్తపారేస్తున్నారు. చెత్త వేయోద్దని అధికా రులు చెబుతున్నా ఎవ్వరూ పట్టించు కోవడం లేదు. ఇళ్లలోని చెత్తను రెండు రోజులకోసారి పోగేస్తున్నారు. డంపింగ్ యార్డు దూరం కావడంతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఏదేమైనా పట్టణంలో అభివద్ధి పనులు జరగడం లేదు. పారిశు ద్ధమైనా పటిష్టం చేయడం లేదని జనాలు విమర్శిస్తు న్నారు. ముఖ్యంగా గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ప్రత్యేక దష్టిసారించి జిల్లా కలెక్టర్ తో మాట్లాడి చెత్త డంపింగ్ కు గొల్లనపల్లి లో స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

31లోపు లేఖలను పోస్టుచేయాలి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : ఢై అఖర్ లెటర్ రైటింగ్ కాంపిటీషన్ ఈ నెల 1వ తేదీ నుండి ప్రారంభమైందని, పూర్తి అయిన లేఖలను 31వ తేదీ లోపు పోస్ట్ చేయాలని మచిలీపట్నం డివిజన్ సూపరిం టెండెంట్ అఫ్ పోస్ట్ ఆఫీస్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆ తర్వాత అందే లేఖలు స్వీకరించబడ వన్నారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ 2023-24 సంవత్సరానికి డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా అనే అంశంపై జాతీయ స్థాయిలో ఢై అఖర్ లెటర్ రైటింగ్ జాతీయ స్థాయిలో కాంపిటీషన్ నిర్వహిస్తుందని తెలిపారు. వయస్సు 18 ఏళ్ళ లోపు ఒకటవ కేటగిరి, 18 ఏళ్ళు పైబడిన రెండవ కేటగిరిలోనికి వస్తారని చెప్పారు. లేఖలను ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషలలో రాసి ది సూపరింటెండెంట్ అఫ్ పోస్ట్ ఆఫీస్, మచిలీపట్నంకు పంపవచ్చున్నారు. చేతితో వాసిన అక్షరాలు మాత్రమే ఆమోదించ బడతాయన్నారు. సాదా ఎ4 సైజు కాగితానికి వెయ్యి పదాలు, ఇన్‌ల్యాండ్ లెటర్ కార్డుకు (ఐఎల్సి) అయితే 5 వందల పదాల పద పరిమితి ఉందని తెలిపారు. అనుమతించిన స్టేషనరీ, సాదా ఎ4 సైజు పేపర్ లెటర్, ఇన్‌ల్యాండ్ లెటర్ కార్డ్, స్టాంప్‌తో కూడిన ఎంబోజ్డ్ ఎన్విలాపులో పంపాలని చెప్పారు. దీనిపై వివిధ స్కూల్స్, కాలేజీలలో వర్కుషాపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు అందరూ వినియోగించు కావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని భారతి హాస్పటల్ సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్ రామ్ సహాయం అందించారు. ఆదివారం బాధ్యత కుటుంబాల వద్దకు వెళ్లి వారిని పరామర్శించి ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాద బాధితులు కేసన్న కష్ణకుమారి సూరగం నాగమల్లేశ్వ రీ లకు ఆర్థిక సాయంతో పాటు దుస్తులు కూడా అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ నాయకులు చెన్ను గాంధీ, మండలి రామ్మోహన్రావు, చిన్ను బాబురావు, మండలి బలరాం, చెన్ను బుల్లియ తదితరులు పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న మండలి వెంకట్రామ్

అనుమానితుల వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నివారణ, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టిన నేపథ్యంలో జిల్లా ఎస్పి జాషువా ఆదేశానుసారం పోలీసు యంత్రాంగం అనుమానితులు కదలికలు, బహిరంగ మద్య సేవనంపై ఆదివారం విస్తత తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బంది వారి పరిధిలలో విస్తతంగా వాహన తనిఖీలు చేశారు. అలాగే రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చొరవ తీసుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తూ, తాగి వాహనాలు నడిపిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల కాలంలో జరుగుతున్న నేరాలను దష్టిలో పెట్టుకొని అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘాను ఏర్పరిచి ఎవరైనా అనుమానాస్పదంగా తారస పడితే మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ (ఎంఎస్సిడి) తో వేలిముద్రలు సేకరించారు. గతంలో వారి నేర చరిత్రను పరిశీలించి, కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ 93, బహిరంగ మద్య సేవనం 148, ఎంఎస్సిడితో 4 గురు అనుమానితులను జిల్లా వ్యాప్తంగా గుర్తించి కేసులు నమోదు చేశారు.

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : స్థానిక చిలకలపూడి మదర్ థెరీసా విగ్రహం వద్ద విశ్వజనని మదర్ థెరీసా 113 వ జయంతి, నవ చైతన్య మదర్ థెరీసా సేవా సమితి 17 వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మదర్ థెరీసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమితి ఆధ్వర్యంలో బియ్యం, నిత్యవసర వస్తువులు పంపిణీ, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సమితి గౌరవ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పర్నం సతీష్, పడమట రమేష్, డివిజన్ ఇన్చార్జి వేముల వనబాబు, జిల్లా రాధా, రంగా మిత్ర మండలి అధ్యక్షులు బుల్లెట్ ధర్మారావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడమంచిలి చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించారు. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ లాప్రో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ నాగరాజు, సమితి అధ్యక్షులు పైడిపాముల గురు ప్రసాద్, సమితి ప్రధాన కార్యదర్శి కుమ్మరి జలాచంద్రుడు, ఉపాధ్యక్షులు అల్లాడ రాజా, యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మరి హర్ష, న్యాయవాది జొన్నల గడ్డ వెంకట నాగరాజు, చిలకలపూడి స్థానికులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ లోని చైల్డ్హుడ్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మదర్ తెరిసా 113వ జయం తిని నిర్వహించారు. ఆదివారం ఆ సంస్థ కార్యాలయం వద్ద మదర్ తెరిసా చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు ఈ సందర్భంగా చైల్డ్హుడ్ అడ్మిన్ దీవి లీలా కష్ణ మాట్లాడుతూ సేవా మూర్తి మానవతావాది మదర్ తెరిసా అని కొనియాడారు. ఈగోస్లేవియా లో జన్మించి కలకత్తాలోని మురికి వీధులలో అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప మహోన్నత సేవ మూర్తి మదర్ తెరిసా అన్నారు. ఆ రోజుల్లో కుష్టు వ్యాధి అంటేనే భయపడే పరిస్థితుల నుంచి ఎంతో మానవతా దక్పథంతో తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేశారని అన్నారు. అమ్మగా ఆమె చేసిన సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని పోటీవారికి సాయం చేయాలని, దీనులు దిక్కులేని వారికి సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ సమస్త సభ్యులు అలపర్తి గోపాలకష్ణ, అన్నపరెడ్డి కష్ణ మోపిదేవి, శ్రీనివాస్, యాసం శోభన్ బాబు, హనుమంతు, శ్రీనివాస్ బండే శ్రీను తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆమె జీవిత చరిత్ర, తన సేవా కార్యక్రమాల్లో ముఖ్య ఘట్టాలను పిల్లలకు గురవయ్య మాస్టారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో...

అవనిగడ్డలో...

విరాళం అందజేస్తున్న శ్యామ్ కిషోర్ నాయుడు

రూ. 10 వేల విరాళం

ప్రజాశక్తి-అవనిగడ్డ : జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని హాకీ మాంత్రికుడు ధ్యాన్చంద్ జయంతి సందర్భంగా ఈనెల 29న అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో అవనిగడ్డ సబ్‌జన్ వ్యాయామ ఉపాధ్యాయులు సంఘం నిర్వహించే సబ్ జోన్ ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసే నిమిత్తం శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు రూ పదివేల విరాళం అందజేశారు. ఆదివారం శ్యామ్ కిషోర్ ఇంటి వద్ద బహుమతుల నిమిత్తం సంఘం ట్రెజరర్ మునగాల ఉదయ్ కుమార్ కి నగదును అందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం సభ్యులు రేమాల శ్రీనివాసరావు, తోట నరసింహనాయుడు, సాయి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు

టిడిపి అభ్యర్థి గెలుపునకు కృషి

ప్రజాశక్తి పెదపారుపూడి : వచ్చే ఎన్నికల్లో పామర్రు నుంచి టిడిపి అభ్యర్థిని గెలిపిస్తామని పామర్రు నియోజకవర్గ ఎస్సి సాధికార సంఘ అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన దగాని లెనిన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై ఎంతో నమ్మకముతో అప్పగించిన ఈ బాధ్యతను స్వీకరించి రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో టిడిపి అభ్యర్థిని గెలిపించి పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు గిఫ్టుగా అందిస్తానని అన్నారు. తనకు పార్టీలో స్థానం ఏర్పాటు చేయడానికి కషిచేసిన టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజాకు, మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరికి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-చల్లపల్లి : చిట్టూర్పు వాస్తవ్యులు పెనుమాక సారధి పుట్టినరోజు సందర్భంగా సతీమణి, కుమార్తె, ఆయన తల్లి కలసి స్థానిక పార్వతమ్మ తోటలోని ఆదరణ వద్ధాశ్రమం లోఆదివారం వద్ధుల మధ్య కేక్ కటింగ్ చేసి అన్నదానం చేసినారు వద్ధాశ్రమానికి ఒక ఫ్యాను వితరణ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు జంజనం రామ్మోహన్ రావు,శార పాల్గొని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసి ధన్యవాదాలు తెలిపారు.

సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దేశంలో రోజు రోజుకూ పెరిగి పోతున్న అధిక ధరలు, నిరుద్యోగ సమస్యలపై సిపిఎం సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పటమటలం కలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని సమస్యలపై పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, తూర్పు నగర కార్యదర్శి వర్గ సభ్యులు పుప్పాల కృష్ణ, నగర కమిటీ సభ్యులు విజ్జి గురుమూర్తి, రవీంద్ర, నాయకులు మస్తాన్, ఏడు కొండలు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న రమణమూర్తి

అల్లీ కాఫీ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలో ఐటిఐ కాలేజీ ఎల్‌ఐసి కాలనీ నెల్సన్ మండేలా పార్కు ఎదు రుగా వైఎన్నార్ ఛారిటీస్ అధినేత యల మంచిలి జయప్రకాశ్, అరుణ దంపతులు నూత నంగా ఏర్పాటు చేసిన ద అల్లీ కాఫీ అండ్ రెస్టారెంట్‌ను ఆంధ్ర హాస్పటల్ ఎమ్‌డి రమణమూర్తి, తూర్పు నియోజకవర్గ ఇంఛార్జి దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ, వైసిపి సీనియర్ నాయకులు కడియాల బుజ్జిబాబు, మాజీ డిప్యూటీ మేయర్ అల్లా చెల్లారావు పలువురు ప్రముఖులు కలిసి రెస్టారెంటును లాంఛనంగా ప్రారంభించారు. సేవా, రాజకీయా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందిన యలమంచిలి జయప్రకాశ్ నూతన రెస్టారెంట్ మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు దేవినేని అవినాష్ తెలిపారు. రుచికరమైన కాఫీ, బిర్యానీ, చైనీస్, తందూరి లాంటి వెరైటీ వంటకాలు భుజించి చక్కటి అనుభూతిని పొందేలా రెస్టారెంట్ వైఎన్నార్ ఛారిటీస్ అధినేత అల్లి రెస్టారెంట్ యాజమాని యలమంచిలి జయప్రకాశ్ తెలిపారు.

దుర్గగుడి కళావేదికపై ఆంధ్ర నృత్యాలతో అలరించిన కళాకారులు

దుర్గగుడి కళా వేదికపై నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ధర్మపథంలో భాగంగా ఆదివారం నిర్వహించిన ఆంధ్ర నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ధర్మపథం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా దుర్గగుడి మహామండపం ఆరో అంతస్తులో గల వేదికపై శ్రీ నటరాజ నృత్యాలయం, విజయవాడ రాయన శ్రీనివాసరావు శిష్య బృందం నేతృత్వంలో ఆంధ్ర నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కుంభ హారతి, అలరింపు, దశావతారములు, సంధ్యా సమయం, వేణుగానరవంబు, కన్నయ్య జన్నించే, ముద్దుగారే యశోద వంటి నృత్య ప్రదర్శనలను తిలోత్తమ, భవ్యశ్రీ, కుందన వర్షిణి, దీత్య, మోక్షిత, జాగృతి, యశశ్విని, దేదివ్య, లక్ష్మీ చైత్ర, రేష్మ, నివ్య, దీపిక, భవానీ, హేమ, రాజశ్రీ, కిరణ్మయి చేసిన నృత్య ప్రదర్శనలు పలువురు భక్తులను అలరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : నేడు పాయికాపురం సబ్‌స్టేషన్ ఏరియాలో 11 కె.వి.సుందరయ్య నగర్ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మత్తుల భాగంగా న్యూ రాజీవ్ నగర్, ఎంఐజి కాలనీ, ఏ-కాలనీ, గల ప్రాంతాలలో ఈనెల 28వ తేదీ సోమవారం ఉదయం 8.00 గంటల నుండి 10.00 గంటల వరకు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని కావున వినియోగదారులందరూ గమనించి సహకరించవలసిందిగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయవాడ టౌన్ బి.వి సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా'కు దరఖాస్తులు చేసుకోవాలి

ప్రజాశక్తి - విజయవాడ : 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో పాల్గొని ఆటలు ఆడే వారందరూ నగరంలోని ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... రాష్ట్రంలోని ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే ప్రయత్నంలో భాగంగా అక్టోబర్ 2 నుండి నవంబర్ 8 వరకు 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు రకాల క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబాడీ, కోకోలో పాల్గొనేందుకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ చెప్పారు. 15 సంవత్సరాలు దాటిన ప్రతి యువత ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. దీనిలో వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు అనర్హులన్నారు. పాల్గొనే వారందరికీ శ్రేయస్సును నిర్ధారించడానికి, ఈవెంట్ వేదికల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని విజేతలకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా బహుమతులు అందజేస్తారన్నారు. మొదటి, రెండో, మూడో స్థానాలను కలిగి ఉన్న బహుమతులు అన్ని క్రీడలకు వరుసగా 50,000, 30,000, 20,000 నగదు అవార్డులను ఇవ్వనున్నట్లు తెలిపారు. మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలకు క్రమంగా పురోగమించే ముందు ఈ కార్యకలాపాలు గ్రామ, వార్డు సచివాలయ స్థాయిల్లో ప్రారంభమవుతాయన్నారు. ఈ పోటీలో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ లింగం ఆధారంగా ఆలోచనాత్మకంగా విభజించబడ్డాయన్నారు. ఔత్సాహికులైన క్రీడాకారులందరూ తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవడానికి అందుబాటులో ఉన్న స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని నగర కమిషనర్ కోరారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్

ప్రజా వైద్యులు డాక్టర్ కొంగర దేవదాస్

సంస్మరణ సభలో పలువురి నివాళి

సంస్మరణ సభకు హాజరైన వైద్యులు

నివాళులర్పిస్తున్న సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రజా వైద్యులకుగా డాక్టర్ కొంగర దేవదాస్ ఎంతో మందికి వైద్య సేవలు అందించారని, పేద ప్రజలకు వైద్య సేవలను అందించడంతో పాటు ఆరోగ్య రంగంపై అనేక అవగాహనా సదస్సులు నిర్వహించి ఎంతో మందికి ఆదర్శప్రాయులుగా ఉన్నారని పలువురు వక్తలు అన్నారు. ప్రజా వైద్యులు డాక్టర్ కొంగర దేవదాస్ సంస్మరణ సభ ఆదివారం నగరంలోని ఎ ప్లస్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన పలువురు వైద్యులు, వైద్య ప్రముఖులు, పలువురు ప్రముఖులు హాజరై కొంగర దేవదాస్ చిత్ర పటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు కొంగర దేవదాస్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేవదాస్ ప్రజా వైద్యులుగా ఎంతో పేరు గడించారని అన్నారు. హుజూర్ నగర్‌లో ప్రజా వైద్య శాలను స్థాపించి పేద ప్రజలకు ఆయన ఉచిత వైద్య సేవలను అందించారన్నారు. అటువంటి గొప్ప వైద్యులు నేడు మన మధ్య లేకపోవడం బాధాకరమని అన్నారు. మహిళా సంఘం నాయకులు డి.రమాదేవి, ఆంధ్రా హాస్పటల్స్ అధినేత డాక్టర్ పి.వి. రమణమూర్తి, ఎబిసి ఇమేజింగ్ అధినేత డాక్టర్ రాజేశ్వరరావు, పలువురు వైద్యులు పాల్గొని నివాళులు అర్పించారు.

హాస్య సన్నివేశాలు ఆకట్టుకుంటాయి

మాట్లాడుతున్న హీరో నవీన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మిస్టర్ పోలిశెట్టి చిత్రం సెప్టెంబర్ 7న విడుదల కానుందని ఆ చిత్ర హీరో నవీన్ పోలిశెట్టి తెలిపారు. చిత్రంలో వచ్చే హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తాయని... ఈ చిత్రంలో అనుష్క తన కంటే ఐదేళ్ల పెద్ద క్యారెక్టర్‌లో నటిస్తుందని పేర్కొన్నారు. త్వరలో రెండు చిత్రాల్లో నటించనున్నానని, ప్రేక్షకులందరూ కచ్చితంగా థియేటర్లోనే సినిమా చూడాలని, పైరసీని ప్రోత్సహించొద్దని కోరారు.

విజయవాడ నగరంలో హీరో నవీన్ పోలిశెట్టి హీరోయిన్ అనుష్క జంటగా నటించిన మిస్టర్ పోలిశెట్టి చిత్రం యూనిట్ సందడి చేసింది. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఆ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆచిత్ర హీరో నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూ... మిస్టర్ పోలిశెట్టి చిత్రం ప్రమోషన్ కార్యక్రమాన్ని విజయవాడ నగరం నుంచి ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విజయవాడ నగరంతో తనకెంతో అనుబంధం ఉందన్నారు. చదువుకున్న రోజుల్లో విజయవాడలోనే ఎక్కువగా ఉండేవాడినని పేర్కొన్నారు. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి చిత్రంకు సంబంధించిన టీజర్ ట్రైలర్‌కు ఇప్పటికే ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈ చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టు కుంటుందనీ.... ఈ చిత్రం సెప్టెంబర్ 7న విడుదల కానుందని తెలిపారు. జాతి రత్నాలు చిత్రం వచ్చిన మూడేళ్ల విరామం తర్వాత ఈ చిత్రంలో నటించానని అన్నారు. బాహుబలి 2 తర్వాత అనుష్క కూడా ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిందన్నారు. సీనియర్ హీరోయిన్ అనుష్క పక్కన హీరోగా నటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రంలో వచ్చే హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తాయని...ఈ చిత్రంలో అనుష్క నాకంటే ఐదేళ్ల పెద్ద క్యారెక్టర్‌లో నటిస్తుందని అన్నారు. దర్శకుడు మహేష్ బాబు తీసిన సన్నివేశాలు ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటాయనీ... పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని సెప్టెంబర్ 7న సినిమాను రిలీజ్ చేయనున్నామని తెలిపారు. త్వరలో రెండు చిత్రాలలో నటించనున్నానని, ప్రేక్షకులం దరూ కచ్చితంగా థియేటర్లోనే సినిమా చూడాలి పైరసీని ప్రోత్సహించవద్దనీ కోరారు. తెలుగు, తమిళం, మలయాళం కన్నడ భాషలలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నామనీ తెలిపారు.

నేడు జిల్లా కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి-విజయవాడ : జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10: 30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ యస్.ఢిల్లీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. డివిజన్, మండల, గ్రామ వార్డు సచివాలయాల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజలు తమ అర్జీలను గ్రామ,వార్డు సచివాలయం, మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించ వచ్చునని కలెక్టర్ డిల్లీ రావు ఆ ప్రకటనలో తెలిపారు.

మాట్లాడుతున్న రాంబాబు

మాతృభాషా పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : తెలుగు మాతృ బాషా పరిరక్షణ మనందరి బాధ్యత అని, గిడుగు రామమూర్తి స్ఫూర్తితో ముందుకు సాగాలని అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొప్పర్తి రాంబాబు అన్నారు. తెలుగు వ్యావహారిక బాషా పితామహుడు గిడుగు రామమూర్తి 160 వ జయంతి, తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఎన్ టి ఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక ప్రజాశక్తి నగర్‌లోని చంద్ర రాజేశ్వరావు స్మారక గ్రంథాలయం హాల్లో సాహిత్యసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తెలుగు అనే పదంలోనే ఎంతో మాధుర్యం ఉందని తేనెలొలుకు భాష మన తెలుగు భాష అమ్మదనం నిండిన కమ్మనైన భాష తెలుగు అని, మనం ఇంట్లో మాట్లాడే భాష, బడిలో మాట్లాడే భాష రెండూ వేర్వేరుగా ఎందుకు ఉండాలి అని వాడుక భాష లోనే పాఠ్యాంశాలు ఉండాలని గిడుగు ఉద్యమం సాగించారని గుర్తు చేశారు. పురాణ కథలు అయినటువంటి రామాయణ భారతం వంటి వాటిలో ఉన్న గ్రాంథిక భాష నుండి నేడు మనం ఉపయోగిస్తూ ఉన్న వాడుక బాష వ్యాప్తి కోసం గిడుగు విశేష కషి చేశారని కొనియాడారు. గౌరవ అధ్యక్షులు కొండపల్లి మాధవరావు, ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్ కుమార్ కార్యదర్శి మోతుకూరి అరుణకుమార్ మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుండి మొదటగా భాష నేర్చుకునేది అమ్మ ఒడిలోనే అని, మాతృ భాష ద్వారానే తనలోని భావాలను వ్యక్త పరచగలరని, మన తెలుగు భాష లోని పద్యాలు, కవితలు, గేయాలు, ఛందస్సు,ఇవన్నీ వాటికవే సాటి అని అన్నారు. ఏపి ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి చంద్రా నాయక్ ఎస్ టి యు నాయకులు ఎమ్. వేణుగోపాల్ మాట్లాడుతూ దేశ భాష లందు తెలుగు లెస్స అని శ్రీ కృష్ణ దేవరాయలు అన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పరగటి భాను , కొడాలి ఆనందరావు, సాహిత్య మిత్రులు, గ్రంథాలయ పాఠకులు హాజరయ్యారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.